

# మరీ చి.క

కర్లపాలెం హనుమంతరావు



## మరీ చిన్నకథలు

ఇవి చిన్న కథలుగా కాకుండా 'మరీ చిన్నకథ'లు (మరీ.చి.క) లుగా నేను భావిస్తున్నాను. ఈ మధ్య అనుకోకుండా ఒకసారి సెయింట్ లూయిస్ లో ఉన్నప్పుడు ఒక పుస్తకాల దుకాణానికి వెళ్లాను. అక్కడ Running Press ప్రచురించిన ' The World's Shortest Stories ' అనే పుస్తకం చూడటం తటస్థించింది. కేవలం 55 పదాలు మించకుండా ఒక కథానికను ప్రాథమిక స్వరూప స్వభావాలు చెదరకుండా చెప్పే విధానం నాకు కొత్తగా అనిపించింది. అందులోని మర్డర్, లవ్, హారర్, సస్పెన్సు విభాగాలకింద చెప్పబడిన వందకు మించిన కథలలో కొన్ని నాకు నచ్చాయి. వాటిని యథాతథంగా తీసుకోకుండా.. కేవలం ప్రక్రియపరంగా ప్రేరణ పొంది కొన్ని చిన్నకథలు నేనూ ప్రయత్నించాను.

ఈ కథలు పూర్తిగా నా స్వతంత్రమైన ఆలోచనలు. వేటినుంచి ప్రేరణ పొందే ప్రయత్నం చేయలేదు సరికదా.. అటువంటివి బుర్రలో జొరబడినప్పుడు ప్రయత్నపూర్వకంగా వాటిని పరిహరించే ప్రయత్నం కూడా చేసాను. నా ఈ ప్రయోగం కేవలం ఒరిజినల్ గా ఉండాలన్నదే నా ఆశ.

ఇక నేను చదివిన పుస్తకంలోని కథలకు చాలా నియమ నిబంధనలు విధించారు సంపాదకులు. కేవలం పదాలకే పరిమితం కాకుండా ఫుల్ స్టాపులు, కామాలు, సెమి కోలన్లు.. వగైరాకూడా వాటిలో చర్చకు వచ్చాయి. మరీ అంత తాడుమీద నడకలాగా కాకుండా.. ప్రాథమికంగా కథను అతి తక్కువ మాటల్లో అత్యంత శక్తివంతంగా చెప్పే ప్రయత్నంమీద మాత్రమే నేను దృష్టి ఉంచడం జరిగింది. కొన్ని కథలకు కేవలం వంద పదాలే సరిపోతే.. కొన్ని కథలకు మూడువందల పదాల వరకు అవసరమయ్యాయని గమనించాలి. ఏదేమైనా మౌలికంగా ఇది మరీ చిన్న కథ(మరీ.చి, క) గా ఉండాలన్నదే నా ప్రధాన లక్ష్యం.

ఈ మరీ.చి.క లో సైతం కథాలక్షణాలన్నీ యథావిధిగా ఉండి తీరాల్సిందే. స్థూలంగా ఒక మరగుజ్జు వృక్షం (బోన్సాయ్) అనుకోవచ్చేమో! కథ చదివిన తరువాత కుదించిన పెద్దకథగా పాఠకుడు భావిస్తే ఆ మరీ.చి.క విఫలమయినట్లే. ఒక కథ, కథానిక పూర్తిగా చదివిన తరువాత కలిగే భావోద్వేగాలకు తగ్గకుండా చెప్పగలిగిన మరీ.చి.క మాత్రమే నేను అనుకొన్న ప్రక్రియకు సరితూగేది.

ఇన్ని విషయాలు దృష్టిలో ఉంచుకొని కొన్ని మరీ.చి.క లు ప్రయత్నంచాను. ఇప్పుడు చాలా పత్రికలలో 'సూక్ష్మ కథలు.. పోస్టు కార్డు కథలు, పొట్టి కథలు, చిట్టి కథలు.. అని రకరకాల పేర్లతో చిన్నకథలు వస్తున్న మాట నిజమే కానీ.. వాటి స్వరూప స్వభావానికి మరీ.చి.క కూ తేడా ఉండాలని నా ప్రయత్నం. మరీ.చి.క ఒక సమగ్రమైన అతి చిన్న కథగా పాప్యులర్ కావాలని నా కోరిక. రావి శాస్త్రిగారు ఆంధ్రజ్యోతిలో కొంతకాలం ఒక కాలానికి మించకుండా కథ చెప్పే ప్రయత్నం చేసారు. అందులో కొన్ని నిజమైన అతి చిన్న కథలు. ఆ బాటలో మరీ నడవలేక పోయినా మరీ.చి.క దానికదే ఒక ప్రత్యేకత కలిగిన మరీ చిన్న కథగా గురింపు పొందేందుకు నా ప్రయత్నం సాగుతూనే ఉంటుంది.

\- రచయిత

# పెళ్ళిచూపులుకాని పెళ్ళిచూపులు

రామసుబ్బు చేసేది విప్రోలో పెద్ద ఉద్యోగమే అయినా బామ్మగీసే గీటు దాటేరకం బొత్తిగా కాదు. ఒక్క పెళ్ళి అనేమిటి! పెళ్ళిచూపులుకూడా శుద్ధసాంప్రదాయఫక్కీలో సాగితీరాలన్న బామ్మగారి ఆంక్ష. అందుకు ఒప్పుకున్న తరువాతే సుబ్బరామమ్మను చూసేందుకు రామసుబ్బు స్నేహితుడితోసహా తరలి వచ్చింది.

పాతకాలం మోడల్లో ఫలహారాలు సుష్టుగా లాగించిన తరువాత పిల్లను తెచ్చి చాపమీద కూర్చోపెట్టారు. మగపెళ్ళివారి తరుపునుంచి ప్రశ్నలవర్షం ప్రారంభమయింది.

'సంగీతం వచ్చా?

'రామలాలీ మేఘ శ్యామలాలీ..'

'గొంతులు బాగున్నాయి సరే ఆమెతో పాటు ఆ పక్క జంటస్వరం ఎందుకు?'

'మొదట్నుంచీ మాకిద్దరికీ కలిసి పాడటమే అలవాటండీ!'

'సంగీతానిదేముందిలేండి! సంసారం చేసుకోవడానికి కావాల్సింది వంటా వార్పూ! వంటచేయడం వచ్చా.. రాదా.. మీ స్నేహితురాలికి?'

'వంకాయకూర బ్రహ్మాండంగా చేస్తుందండీ!'

'వంకాయకూర ఒక్కటేనా వచ్చు?!'

'కాలేజీకెళ్లి చదువులు సాగించడంచేత ఇంట్లో వంటచేసే తీరిక లేదండీ! కావాలంటే రెండునెల్లలో అన్నీ నేనే దగ్గరుండి నేర్పిస్తానండీ! నాకు అన్ని రకాల వంటలూ చేయడం వచ్చు'

'బాగుంది! రేపు మీ స్నేహితురాలికి ఒంట్లో ఓపికలేదు పొమ్మన్నా మీరే ఆపద్ధర్మంగా ఆమెకు సాయం పట్టేటట్టున్నారే! మరి మీరు ఏమీ చదువుకోవడం లేదా ఏమిటీ?'

'ఇద్దరం కలిసే చదువుకొన్నామండీ ఇంటరుదాకా! మెడిసన్లో నాకు సీటు వచ్చినప్పట్నుంచే విడివిడిగా వెళ్ళి చదువుకోవాల్సి వస్తోంది'

'సరే! కాస్త మీ స్నేహితురాలిని అసుంటా నడిచి చూపించమనండి! లేకుంటే కాలో చెయ్యో వంకరుంటే ఎలా తెలిసేదీ!'

సుభద్ర పక్కనుండి సుబ్బరామమ్మచేత నడిపించింది.

కట్నకానుకలదాకా రాకుండానే ఆ సంబంధం రద్దయిపోయిందని వేరే చెప్పాలా!

సదేలే! మరి ఈ మాత్రం దానికి ఇంత బిల్డప్ దేనికంటారా!

అక్కడే ఉందండీ అసలు ట్విస్టంతా. సంబంధం రద్ధయిందన్నానేగాని.. బాజాభంత్రీలు మోగలేదని అన్నానా!

ఈ పెళ్లిచూపులు అయిన రెండునెల్లకు భాజాభంత్రీలు మోగాయి.. రామసుబ్బు స్నేహితుడు సుబ్రహ్మణ్యం పెళ్లికొడుకైతే.. సుబ్బరామమ్మ స్నేహితురాలు సుభద్ర పెళ్ళికూతురు!

వాళ్ళిద్దరూ ఒకళ్లకొకళ్ళు తెగనచ్చేసుకొన్నారు రామసుబ్బు పెళ్ళిచూపుల్లో.

బామ్మగారి పనుపుమీద పెళ్లికూతుర్ని అడ్డమైన ప్రశ్నలు వేసినందుకు ఆనక సుబ్బరామమ్మకు సుబ్రహ్మణ్యం ప్రయివేటుగా 'సారీ' చెప్పడం సుభద్రకు తెగనచ్చేసింది. స్నేహితురాలికోసం పెళ్ళిచూపుల్లో సుభద్ర అన్నిరకాల మాటలు చిరునవ్వుతో ఎదుర్కోవడం సుబ్రహ్మణ్యానికీ బాగా నచ్చేసింది.

పెళ్ళిచూపులు కాని పెళ్ళిచూపుల్లో నిజమైన పెళ్లిచూపులు జరగడమే ఈ కథలో విశేషం.

★★★

# ప్రేమ లేఖ

ప్రియాతి ప్రియమైన ప్రాణనాథా!

నిన్ను విడిచి నేను పోలేను! నన్ను వీడి నువ్వూ తప్పించుకు పోలేవు! ఎన్నెన్నిజన్మల సంబధమోగదా మనిద్దరిదీ! నాలో పారేది నీ రక్తప్రసాదమే సుమా! అంత తేలికగా రద్దయిపోయేదా మనిద్దరి బంధం!

నీకు నేనంటే కంపరం ఎందుకో అర్థం కాదు! నాకైతే మాత్రం నువ్వే సర్వస్వం. జీవనాధారం. ప్రాణాధారం. నువ్వు లేకుంటే నాకు ఉనికి ఏదీ?

నా నుంచి తప్పించుకోవాలని నువ్వెన్ని ఎత్తులైనా వెయ్యి! అంతకు వెయ్యి రెట్లు పైయెత్తులు వెయ్యడానికి నేను రడీ!

నన్ను మరచి ఆదమరచి హాయిగా నిదుర పోదామనే.. వెర్రి కాకపోతే! అయినా నీ కంటికి నేనొక్కతినే కంటకిలా కనిపిస్తున్నానా! నీ చెవిలో 'గీ' పెట్టే రాక్షసిని నేనొక్కతినేనా! ఈ చెవితో విని ఆ చెవితో వదిలేస్తావని అంతా నిన్ను ఆడిపోసుకొంటారు గదా! మరి నా సంగీతాన్నే ఎందుకు అంతలా అసహ్యించుకుంటావు ప్రియతమా? అసహ్యించుకొంటూనే మళ్లీ వింటావు?!

నిన్ను చూస్తే నిజంగా నవ్వొస్తుంది. జాలేస్తుంది. వంటికి ఆ జిడ్డు పులుముళ్లేమిటి? ఇంటినిండా ఆ పొగ పెట్టడమేమిటి? నాకూ మీకూ మధ్య ఈ పిచ్చి తెరలు ఒక అడ్డా?!

నువ్వు పుట్టి.. నేను పుట్టి ఇన్ని యుగాలయింది!

మన బంధాన్నా పరమాత్ముడైనా తెంపగలిగాడా! అసలా దేవుళ్లకే నేనంటే హడల్! ఒకాయన పాలసముద్రంలో పాం పడగలకింద, మరో పెద్దమనిషి మంచుకొండల మధ్య గణాలమధ్యలో.. దాక్కొన్నారు. నా దెబ్బకు తట్టుకోలేకే మరో ముసిలిదేవుడికి బ్రహ్మచెవుడు వచ్చిపడింది!

మన ప్రేమాయణం మధ్య మరొకళ్ల ఊసెందుకులే గానీ.. చివరగా ఒక్క ముక్క చెబుతున్నాను.. శ్రద్ధగా వినుకో! నా నుంచీ తప్పించుకోవాలని నువ్వా తెరల వెనక పొర్లుతున్నావు గానీ ప్రయోజనం శూన్యం ప్రాణమిత్రమా! సందు చూసుకొని నేనే నీ పడకమీద కొచ్చేస్తాను. వీలుపడకపోతే ఇక్కడే బైట నీకోసం ఎన్ని జన్మలైనా కాపు కాస్తాను. నీ దేహగంధం ఆఘ్రాణించనిదే.. నీ వేడిరుధిరం ఓ గుక్కయినా ఆస్వాదించనిదే నాకు బతుకు లేదు. బతకాలని ఉండదు. అర్థం చేసుకొంటావు కదూ నా విరహవేదన!

వేయి కళ్లతో నీ కోసం అన్వేషణ కొనసాగిస్తూనే ఉండే

నీ

మశకరాణి

(దోమలకూ మనసుంటుంది. మనిషిమీద తనకెంతో గాఢమైన ప్రేమా ఉండుంటుంది. తనకీ ఓ భాష వచ్చి ఉండి.. అందులో తీరిక చేసుకొని ఓ ప్రేమలేఖ రాసినా.. అది చదివి స్పందించేందుకు మనిషికి ముందు మనసుండాలి కదా! దోమ భాష తెలుసుండాలి గదా! మనిషి భాషే మనిషికి సరిగా అర్థంకావడం లేదు. ఇక దోమల భాషకూడానా! పాపం.. దోమ!

–రచయిత)

**వచ్చే నెలలో మరికొన్ని మరీ చిన్నకథలు**

COMMENTS